# శాయన్న భార్యాలోలుడు

"నువ్వు పెద్దవాడివి. పదిమందికి నీతులు చెప్పవలిసిన వాడివి. నువ్వే ఇట్లా చేస్తే ఎట్లా చెప్పు?" అని అడిగాడు క్రిష్ణయ్య రామ్మూర్తిని.

క్రిష్ణయ్య రామ్మూర్తి స్నేహితుడు. ఏదో పనిమీద వచ్చినట్టు అదీ యిదీ మాట్లాడి అసలు గ్రంథంలోకి దిగాడు... రామ్మూర్తికి క్రిష్ణయ్య మాటలు అర్థం కాలేదు. కాని, ఏదో సీరియస్‌గా సలహా చెప్పటానికి వచ్చాడనే విషయం మాత్రం తెలిసింది.

"ఇప్పుడు నేనేం చేశాను? సరిగ్గాచెప్పు. లేకపోతే నాకు ఎట్లా తెలుస్తుంది?" అన్నాడు.

క్రిష్ణయ్య కొంచెంసేపు తటపటాయించాడు. తాను చెప్పదలిచింది ఎట్లా మొదలుపెట్టాలా అని ఆలోచించాడు. ఇలా అన్నాడు:— "నీ భార్య మంచిదే అవ్వొచ్చు. నేను కాదనను. కాని, నువ్వుమాత్రం కొంచెం మంచీ చెడ్డా ఆలోచించుకోనఖర్లా? ఆమె చెప్పినదంతా నమ్మటమే?!"

"అసలు సంగతేమిటో చెప్పవోయ్—నానుడు బేరంతోచంపకా!" అన్నాడు రామ్మూర్తి.

క్రిష్ణయ్య చెప్పదలిచింది రామ్మూర్తికి చూచాయగా తెలిసినట్లుంది.

"నువ్వు నీ భార్య చెప్పిన మాటలు విని, నీ చుట్టాలు అందరితోనూ పోట్లాడుతున్నావటగా! అదేమంత మంచిపని చెప్పు? ఎవరికన్నా తెలిస్తే ఏమనుకుంటారు?" అని అడిగాడు.

రామ్మూర్తి ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేదు—"ఈ సంగతి నీకు ఎవరు చెప్పారు?" అని అడిగాడు.

"నా భార్య చెప్పింది!"